ఉద్యోగం లేదని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: శ్రీకాకుళం జిల్లా కొర్లాంకు చెందిన సంపత్ కుమార్ (32) శంకరమఠం రోడ్డు రామలింగేశ్వర టెంపుల్ ఎదురుగా ఓ ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఎంబీఏ వరకు చదివిన సంపత్ కుమార్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అనుకున్న ఉద్యోగం దొరకలేదు. దీనికితోడు ఓ ఫైనాన్స్ సంస్థలో కొత్త బైక్ కోసం తీసుకున్న రుణం ఈఎంఐ కట్టలేకపోవడంతో ఇటీవల ఫైనాన్స్ సంస్థ సిబ్బంది బైక్ను తీసుకెళ్లడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం గదిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఘటనా స్థలంలో లేఖ పోలీసులకు దొరికింది. "సారీ అమ్మా.. నేను అనుకున్నది సాధించలేకపోయాను. నా చావుకి ఎవరూ కారణం కాదు" అని అందులో రాసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ద్వారకానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఐఐ సదస్సుకు విశాఖ సర్వం సిద్ధం

రూ.30 కోట్లతో పెట్టుబడిదారుల సదస్సుకు వసతుల కల్పన



విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించనున్న పెట్టుబడిదారుల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ బిజినెస్ సమ్మిట్ కోసం జీవీఎంసీ రూ.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నగరంలోని అనేక ప్రధాన రహదారులల్లో సెంటర్ డివైడర్‌కు ఉన్న గ్రిల్స్‌కు రంగులు వేశారు. వివిధ జంక్షన్‌లో వాటర్ ఫౌంటెన్లు వంటివి ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతులతో నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వెలుగులతో నింపారు. మరోపక్క విశాఖలో రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు మంత్రివర్గ సభ్యులంతా హాజరుకానున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు అనేక శాఖల ముఖ్య కార్యదర్శులు రెండు రోజులపాటు విశాఖలోని బస చేయనున్నారు.

అటు కేంద్రం ప్రభుత్వం నుంచి మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్, అన్నపూర్ణాదేవి, జితేంద్ర సింగ్‌లు హాజరుకానున్నారు. అలాగే ఈ సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 8 మంది స్పీకర్‌లు ఈ సదస్సులో పాల్గొంటారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్లీనరీ సెషన్, సీఐఐ ద్వారా జరిగే టెక్నికల్ సెషన్లు 27, రాష్ట్ర స్థాయిలో సీఐఐతో కలిసి సంయుక్తంగా 11 సెషన్‌లు జరగనున్నాయి. దేశీయ అంశాలతో 5 సెషన్‌లు, ఒక వీడ్కోలు సెషన్‌లతో సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సదస్సు ద్వారా 9 లక్షల 76 వేల 248 కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా వేయగా, దాదాపు 7 లక్షల 48 వేల 427 మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ సదస్సులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, 82 ప్రాజెక్టులకు శంఖుస్థాపనకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

బ్లేడుతో భవన నిర్మాణదారుడు హల్‌చల్

అనధికార నిర్మాణం తొలగించేందుకు వెళ్లిన జీవీఎంసీ సిబ్బందిపై దాడికి యత్నం.?
ప్రాణ భయంతో పరుగులు తీసిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురం సమీపంలో జరుగుతున్న అనధికార నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన జీవీఎంసీ సిబ్బందిపై నిర్మాణదారుడు దాడికి యత్నించాడు. బ్లేడుతో హల్‌చల్ చేస్తూ రక్తాన్ని అధికారులపై చిమ్ముతూ భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ ఘటనకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారి షర్మిల అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా సైట్‌లో, ఎలాంటి అనుమతులు లేకుండా అధికారులకు తెలియజేయకుండా సూరిబాబు అనే వ్యక్తి భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ జోన్ 8 టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి చేరుకొని అనధికార నిర్మాణాన్ని తొలగిస్తుండగా నిర్మాణదారుడు బ్లేడుతో తన చేతిపైన కోసుకొని అధికారులను కూడా బ్లేడుతో కోసేస్తానంటూ భయభ్రాంతులకు గురి చేశాడు. నిర్మాణం మేడ మీదకు అధికారులను పరుగు పెట్టించాడు. నిర్మాణం వదిలి తక్షణమే వెళ్లిపోవాలని అధికారులను హెచ్చరించాడు. తన చేతి రక్తాన్ని అధికారులపై చల్లుతూ మహిళలను కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దాంతో జీవీఎంసీ అధికారులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విషయాన్ని పరిశీలించి పూర్తి అనుమతులు వచ్చేవరకు ఎటువంటి నిర్మాణ పనులు చేయవద్దని నిర్మాణదారుకు సూచించారు. సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీ నిర్మాణదారుడుపై పెందుర్తి పోలీస్‌లకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటన జీవీఎంసీ అధికారుల్లో కలకలం రేపింది. పోలీసు రక్షణ లేకుండా అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లడానికి జీవీఎంసీ సిబ్బంది భయకంపితులవుతున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రపంచ దేశాల అభివృద్ధికి ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రకటించిందని, ఇవి 17 అని, వీటిని ప్రతి దేశం 2030 నాటికి చేరుకోవాలని ఐక్యరాజ్యసమితి ఆశించిందని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సబ్బవరంలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ విశాఖపట్నం క్యాంపస్ లో బి.టెక్ (నేవల్ ఆర్కిటెక్చర్ మరియు షిప్ బిల్డింగ్) ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల వర్క్ షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రతి దేశం సాధించాలని, అందుకుగాను ప్రభుత్వాలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ లక్ష్యాలు చాలా భారీగా ఉండటం వల్ల వీటిని భారతదేశంలో 2047కు చేరుకునేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఇండియన్ మేరీ టైం యూనివర్సిటీ విశాఖపట్నం క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కేశవ దేవ్ అభినందించారు.

స్వర్గీయ తెన్నేటి విశ్వనాథం చిరస్మరణీయుడు

ఉక్కు కార్మిక సంఘాల ఘన నివాళి

విశాలాంధ్ర - గాజువాక : విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం పోరాడిన యోధుడు స్వర్గీయ తెన్నేటి విశ్వనాథం అని విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నేతలు కొనియాడారు. సోమవారం ఉక్కు నగరం సెక్టార్ 9 తెన్నేటి పార్కులో స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఎంపీ స్వర్గీయ తెన్నేటి విశ్వనాథం 46 వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాల నేతలు తెన్నేటి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం తెన్నేటి విశ్వనాథం చేసిన కృషి మరువ రానిదన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ ఏ.ఐ.టి.యూ సి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఐ.ఎన్.టి.యూ.సి అధ్యక్షులు పి.వి.రమణ మూర్తి , సి.ఐ.టి.యూ ప్రధాన కార్యదర్శి జె.అయోధ్య రామ్, హెచ్.ఎం.ఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, నాయకులు టి.ఎస్.ఎన్. టీ కనకరాజు, పుల్లా రావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సులో రూ.9 లక్షల కోట్ల వరకు ఎంఓయూలు

పెట్టుబడుదారులు రాకుండా వైసిపి కుట్రలు చేస్తే ఊరుకోం
విశాఖ ఎంపీ శ్రీ భరత్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖలో జరిగే సమ్మిట్‌లో 410కి పైగా ఎంఓయూలు, రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు జరుగబోతున్నాయని, విశాఖ సమ్మిట్ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విశాఖ ఎంపీ శ్రీ భరత్ స్పష్టం చేశారు. సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా విశాఖపట్నంలో యూనిటీ మార్చ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్ పాల్గొని మాట్లాడారు. ఈనెల 12వ తేదీన వైజాగ్ బీచ్‌రోడ్డులో, 17వ తేదీన గాజువాకలో యూనిటీ మార్చ్ జరుగుతోందని తెలిపారు. అందరినీ భాగస్వామ్యం చేసి పటేల్ స్ఫూర్తిని భావితరాలకు అందిస్తామని చెప్పుకొచ్చారు. ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సు జరుగనుందని తెలిపారు. పెట్టుబడులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని నొక్కిచెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే మంత్రివర్గం రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. వైజాగ్‌కు రానున్న పరిశ్రమలకు త్వరలోనే శంకుస్థాపనలు ఉంటాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు రావడం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన అనుచరులకు నచ్చడం లేదని తెలుగుదేశం విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఆరోపణలు చేశారు. ఏపీ అభివృద్ధి చెందడం వైసీపీకి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వైసీపీ నేతల్లో మార్పు కనిపించడం లేదన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడుల సదస్సు జరుగుతున్న సమయంలో వైసీపీ ర్యాలీలు చేయడం దురదృష్ట కరమని పేర్కొన్నారు. ఏపీకి మంచి చేయాలని చూస్తే తమ ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. పిల్లల భవిష్యత్తు ముఖ్యమా, స్వార్థ ప్రయోజనాలు ముఖ్యమా అన్నది ప్రజలు ఆలోచించాలని సూచించారు. రుషికొండ ప్యాలస్ కోసం ఖర్చు చేసిన డబ్బులు ఉత్తరాంధ్రలో మెడికల్ కాలేజీలకు పెట్టి ఉంటే పూర్తి అయ్యేవని వివరించారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి, బిజెపి అధ్యక్షులు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం

ఏపీ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: క్రీడలు మానసిక వికాసానికి శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని ఎపి సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి పేర్కొన్నారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 40వ అఖిల భారత తపాలా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఈ నెల 10వ తేదీ సోమవారం నుండి 14వ తేదీ శుక్రవారం వరకు నగరంలోని ఎం.వి.పి కాలనీ, ఎస్3 స్పోర్ట్స్ జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వెయిట్ లిఫ్టింగ్లో అర్జున అవార్డు గ్రహీత నీలంసెట్టి లక్ష్మి మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా ముందుగా శారీరక ఫిట్నెస్ ముఖ్యమని దానికి క్రీడలు చాలా ఉపయోగమన్నారు. విశాఖపట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి.ఎస్.జయ శంకర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఈ క్రీడలను విశాఖలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడల్లో దేశంలోని 14 తపాలా సర్కిళ్లకు చెందిన మొత్తం 129 మంది క్రీడాకారులు ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఛత్తీస్గఢ్, అసోం, ఝార్ఖండ్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ సర్కిళ్ల నుండి పురుషులు మరియు మహిళల విభాగాల్లో పాల్గొంటున్నారన్నారు. పురుషుల విభాగంలో తొలి మ్యాచ్ పశ్చిమ బెంగాల్ సర్కిల్, ఉత్తర ప్రదేశ్ సర్కిల్ మధ్య, మహిళల విభాగంలో తొలి మ్యాచ్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ మరియు ఉత్తర ప్రదేశ్ సర్కిల్ మధ్య జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ పట్నం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎన్.వి.ఎస్.ఎన్.రాజు, విశాఖపట్నం డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ పి.కోమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 97వ వార్డు, సుజాతనగర్ కూడలిలో వైసీపీ వార్డు అధ్యక్షుడు, పెందుర్తి మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మెంటి మహేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మెంటి మహేష్ మాట్లాడుతూ పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆదేశాల మేరకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించామని, ప్రజల నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి మహేష్ బాబు, డిఎన్ మూర్తి, స్వామి నాయుడు, మల్లువలస సన్నీ, సంధ్య, వర్మ, పట్నాయక్, నూకరాజు, సూరిబాబు, జోసెఫ్ రాజు, అప్పారావు, నిరంజన్, కన్నా రావు, నరసింహ మూర్తి, రాంబాబు, రెడ్డి, అల్లు ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా కళాశాల జేకేసీ, ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో సుమారు 15 కంపెనీలు పాల్గొన్నాయని, జాబ్ మేళాకు 250 మంది రిజిస్టర్ చేయించుకొని హాజరయ్యారని వారిలో 107 మంది వివిధ కంపెనీల్లో ఎంపికయ్యారని తెలిపారు. కళాశాలకు సంబంధించిన సుమారు 24 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ సిబ్బంది, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. విష్ణుమూర్తి, కళాశాల జెకెసి కోఆర్డినేటర్ డి.మాధురి, ప్లేస్మెంట్ ఆఫీసర్ వై.వెంకట్రావు పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాల కాలనీలో బోరు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామం బేడా బుడగ జంగాల కాలనీలో శ్రీ నూకాలమ్మ ఆలయం సమీపంలో ఎంపీపీ నిధులతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో బోరు వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ తంద్రి, వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మీ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రమణమ్మ, షిణగం చిన రామారావు, చందక అప్పలస్వామి, మేడిశెట్టి రాంజీ, ఎడ్ల అప్పల నాయుడు, లంక ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఏయూ బ్యాక్‌లాగ్ నియామకాల అక్రమాలపై విచారణ జరపాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్

విశాలాంధ్ర - విశాఖ: ఏయూ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై యూనివర్సిటీ ఉపకులపతి స్పందించాలని సీపీఐ విశాఖపట్నం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విశ్వవిద్యాలయంలో అక్రమాలకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. బ్యాక్ లాగ్ పోస్టుల నియామకాల విషయంలో గోప్యత ఎందుకని ఉన్నతాధికారులను ప్రశ్నించారు. నియామకాల విషయంలో ఉన్నతాధికారులు తీరు అనుమానం కలిగించే విధంగా ఉందని అభిప్రాయం పడ్డారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ వివరాలు, పోస్టుల సంఖ్య, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, మెరిట్ లిస్టును తక్షణమే బహిరంగ పరచాలని డిమాండు చేశారు. నియామకాల విషయంలో పారదర్శకత లోపించడం మూలంగానే అధికార పార్టీ నేతల ఒత్తిడి, లక్షల రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలకు బలం చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యామండలి దృష్టిసారించి, విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాక్ లాక్ అక్రమాలు నిజమని తెలితే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

దీర్ఘకాలిక పద్ధతిన నగర అభివృద్ధి, సుందరీకరణ పనులు

-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో చేపట్టే అభివృద్ధి, సుందరీకరణ పనులు జరుగనున్న 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సు కోసమే కాకుండా, రానున్న వివిధ కార్యక్రమాలకు సిద్ధంగా ఉండేటట్లు దీర్ఘకాలం ఉండేలా ప్రణాళికలు చేసి అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆర్కే బీచ్‌లో ఎక్కువ కాంతి వచ్చే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు బీచ్ సాండ్ పోల్స్ నిర్మాణ పనులను, పార్క్ హోటల్, సిరిపురం జంక్షన్ ల మీదుగా ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ వరకు జరుగుచున్న రోడ్లు, ఫుట్పాతులు, పెయింటింగులు, లైటింగ్, పచ్చదనం, అభివృద్ధి, సుందరీకరణ పనులను సుడిగాలి పర్యటన చేసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసి 11వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తిచేసే సిద్ధం చేయాలన్నారు. ఈ పరిశీలన అనంతరం భాగస్వామ్య సదస్సు పనులపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులు సిఐఐ భాగస్వామ్య సదస్సు కోసమే కాకుండా దీర్ఘకాలం ఉండేలా చేపట్టడం జరిగిందన్నారు. నగరంలో గత మూడు నెలల నుండి జీవీఎంసీ యంత్రాంగం చేపట్టిన నగర అభివృద్ధి ,సుందరీకరణ పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత 3 నెలల కాలం నుండి నగరంలో 26 స్ట్రెచెస్ లో, ఐదు కేటగిరిలలో రోడ్డు పనులు చేపట్టామని, ప్రజా ఆరోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం, హార్టికల్చర్ విభాగం అధికారులు, జోన్ల కమిషనర్లు ఈనెల 14, 15 తేదీల్లో జరుగనున్న సి ఐ ఐ భాగస్వామ్య సదస్సుకు చాలా కష్టపడి నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బీచ్ కు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నందున బీచ్ రోడ్డుపై, బీచ్ లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నిరంతరం స్వీపింగ్ మిషన్ల ద్వారా నిత్య పరిశుభ్రత, సుందరీకరణ పనులు చేపడుతున్నామని, జీవీఎంసీ పరిధిలో ఇకముందు ఐఎఫ్ఆర్, విరివిగా పలు సదస్సులు నిత్యం జరుగుతాయని, జీవీఎంసీ చేపట్టే ప్రతి పని శాశ్వతంగా ఎక్కువకాలం నిలుచుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆపరేషన్ లంగ్స్ ద్వారా ముఖ్యంగా ఆక్రమణలు తొలగించామని వారికోసం వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు.

ప్రజల కష్టాలు తీర్చడం కూటమితోనే సాధ్యం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - కొమ్మాది: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భీమిలి నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. మధురవాడ జంక్షన్ చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.3 కోట్ల 23 లక్షల అంచనా వ్యయంతో చేపట్టను న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "అభివృద్ధికి పునాది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం" అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖపట్నం సహా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు ఊపందుకు న్నాయని ఆయన తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని 6నెలల్లో పూర్తిచేస్తామని గంటా హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, మధురవాడను మరింత ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే.కనకమహాలక్ష్మి, కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, చిక్కాల విజయబాబు, టిడిపి రాష్ట్ర నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టిడిపి జనసేన వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ,సంతోష్ నాయుడు, కానూరి అచ్యుతరావు, నమ్మి రమణ, నమ్మి శ్రీనివాస్, గరే గురునాథ్, బోయి శ్రీనివాస్ రమాదేవి, పోతిన ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.అచ్యుతరావు, జనసేన వీర మహిళ పోతిన అనురాధ,తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సి.పి.బ్రౌన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ పిలిప్ బ్రౌన్ అని ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహ రావు అన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖలో బ్రౌన్ 227వ జయంతి సోమ వారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య ఏ.నరసింహరావు , తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు సిపి బ్రౌన్ చిత్రపటాన్ని పూల మాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు ఆయన చేసిన సేవ అద్భుతం, అనన్య సామాన్యం అన్నారు. ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ కారుమేఘాలలో మెరుపులాంటి మహానీయుడు సిపి బ్రౌన్ మనుచరిత్ర, వసుచరిత్ర, భారతం, దశావతార చరిత్ర మొదలైన ఎన్నో గ్రంథాలను సేకరించి పరిష్కరించిన సాహితీ మూర్తి సిపి బ్రౌన్ అన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ తెలుగు భాషకు సిపి బ్రౌన్ చేసిన సేవలను గూర్చి వివరించి ఒక కవిత కూడా రాసి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గజ్జా యోహాను బాబు, డాక్టర్ దామెర వెంకట సూర్యరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ పులపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ మురారి నాగ కృష్ణవేణి, డాక్టర్ మొంద్రు దాసు, డాక్టర్ మోకా ప్రతాప్, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ లోపింటి గిరీష్, డాక్టర్ రాజులపాటి శివయ్య పాల్గొన్నారు. ఈ సభకు పి.స్నేహలత స్వాగతం పలుకగా బి.ఆశ వందన సమర్పణ చేశారు.

జోన్ 5లో అనధికార నిర్మాణాలు తొలగింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అనధికార నిర్మాణాల కూల్చివేతల చర్యల్లో భాగంగా జోన్ 5 టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం పలు ప్రాంతాల్లో అనధికార కట్టడాలను తొలగించారు. ఫిర్యాదులు అందిన వెంటనే సోమవారం తుమ్మడిపాలెం, వార్డు నెం. 57లో సెల్లార్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణమును పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో తొలగించారు. అలాగే మాధవధార, వార్డు నెం. 51లో అక్రమంగా నిర్మించిన షెడ్డును పట్టణ ప్రణాళిక విభాగం, రెవిన్యూ శాఖ ఆధ్వ ర్యంలో తొలగించడం జరిగిందని జోన్ 5 టీపీఓ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పిల్లల దత్తతకు కృషి

విశాలాంధ్ర – ఆనందపురం: పెద్దిపాలెంలో గల హార్వెస్ట్ మిషన్ ట్రస్ట్ బాలుర, బాలికల వసతి గృహాన్ని జాతీయ దత్తత మాసంలో భాగంగా జిల్లా బాలల సంరక్షణ విభాగాన్ని అధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ దత్తత మాసంలో ప్రత్యేకంగా వసతి గృహాలలో ఉన్న పిల్లలలో దత్తతకు అర్హులైన పిల్లలను గుర్తిస్తామన్నారు. ప్రతి చైల్డ్ కుటుంబ వాతావరణంలో పెరిగితేనే ఆ బాలలు సామాజికమైన అవరోధాలు లేకుండా ఉన్నత భవిష్యత్తు, ప్రతీ చైల్డ్ ఉన్నతమైన జీవితాన్ని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొబేషన్ అధికారిణి అనిజ కుమారి, హెూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎంజే జె.సునీత దేవి, లిడియా, టి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ క్లాప్ వాహనాల లోడర్ల కాంట్రాక్టర్ దుర్గ కన్సల్టెన్సీ కాంట్రాక్టు రద్దు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖలో చెత్త తరలించే వైయస్సార్ కాంగ్రెస్ మద్దతు దారుడైన క్లాప్ వాహనాలు, లోడర్స్ సంస్థ శ్రీ దుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్ అధినేత వెంకటరెడ్డి అక్రమాలు, అవినీతి, ఉల్లంఘనలపై అక్టోబర్ 31వ తేదీన చేసిన ఫిర్యాదుకు జీవీఎంసీ మేయర్, కమిషనర్లు స్పందించారు. శ్రీ దుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థను బ్లాక్ లిస్టులో పెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చర్య ద్వారా జీవీఎంసీలో వైయస్సార్ కాంగ్రెస్ మద్దతుదారుడైన కాంట్రాక్టర్‌పై వేటు వేసినట్లు అయింది. కేవలం కాంట్రాక్ట్ ను సస్పెండ్ చేయడంతో పాటు ఇప్పటివరకు శ్రీ దుర్గా కన్సల్టెన్సీ సంస్థ అధినేత వెంకట్ రెడ్డి జీవీఎంసీ నుంచి అక్రమంగా కొట్టేసిన కోట్ల రూపాయలను రికవరీ చేయాల్సిందిగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈనెల నుంచే డ్వాక్రా సంఘాల ద్వారా లోడర్స్ 655 ఉద్యోగులకు జీతాలు ఇమ్మని ఆదేశించడం పట్ల లోడర్లు వర్షం వ్యక్తం చేశారు.

పరమేశ్వరుని విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర – తగరపువలస: భీమిలి రూరల్ మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీలో గల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్నటువంటి శివాలయం శిఖరంపైన పరమేశ్వరుని విగ్రహా అవిష్కరణ జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ మరియు భీమిలి జడ్పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో స్వామివారికి విశేషమైన ద్రవ్యములతో పంచామృత అభిషేకములు

మంత్ర పుష్పార్చన, బిల్వపత్రార్చన అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమం జరిపించారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గాడు వెంకటప్పుడు, సింగనబంధ గ్రామ సర్పంచ్ గాడు వెంకటనారాయణ, లక్ష్మీపురం శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు కనకల వెంకట్రావు, కనకల సన్యాసినాయుడు, డొకర సన్యాసి, సురాల సన్యాసి, గాడు వెంకట్రావు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా

నగర మేయర్ మాట్లాడుతూ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విశాఖ క్రీడలకు ఎంతో అనుకూలమని, విశాఖ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరగడమే కాకుండా విశాఖ నుండి ఎంతోమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఆటలాడి విశాఖ నగరానికి ఒక గుర్తింపును తీసుకువచ్చారన్నారు. స్వర్ణ భారతి స్టేడియం పూర్తి చేసి పేదలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్ రావు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రుణాలు తిరిగి చెల్లించకపోతే పలు ఇబ్బందులు

విశాలాంధ్ర – విశాఖపట్నం: చాలా మంది రుణం తీసుకొని, ఆపై దానిని తిరిగి చెల్లించకుండా ఉండవచ్చని అనుకుంటారు, తీవ్రమైన ఏమీ జరగదని నమ్ముతారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఒక కేసు ఈ ఆలోచన రుణగ్రహీతలను పెద్ద ఇబ్బందుల్లోకి నెట్టివేస్తుందని చూపించిందని నవీ ఎన్ఎఫ్సిసి ప్రతినిధి చెప్పారు. ఆర్థిక సేవల సంస్థ అయిన నవీ ఫిన్‌సర్వ్, తన రుణాన్ని తిరిగి చెల్లించడానికి నిరాకరించిన కస్టమర్‌పై కోర్టుకు వెళ్లింది. కోర్టు నవీకి అనుకూలంగా తీర్పునిచ్చింది మరియు కస్టమర్ రూ. 83,000 జరిమానా చెల్లించాలని లేదా 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించిందన్నారు. చెల్లింపులు మరియు పరిష్కార వ్యవస్థల చట్టం, 2007లోని సెక్షన్ 25 ప్రకారం, ఈనాక్ బౌన్స్ (మీ బ్యాంక్ ఖాతాలో ఆటో డెబిట్‌కు తగినంత బ్యాలెన్స్ లేనప్పుడు ఇది జరుగుతుంది) చెక్ బౌన్స్ లాగానే పరిగణించబడుతుంది మరియు భారీ జరిమానాలు మరియు 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుంది అన్నారు.

ఘనంగా బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్

విశాలాంధ్ర – విశాఖపట్నం: భారతదేశపు ఫ్యాషన్ ప్రపంచానికి సరికొత్త సొబగులద్దుతున్న బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్, అత్యంత నిర్దుష్టమైన ఈ స్వరం 2025లో మరొక మహత్తరమైన సంచికతో పునఃప్రవేశం చేస్తోంది. ఇక్కడ ఫ్యాషన్, సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమాగమం జరిగి, 'ద వన్ ఎండ్ ఓన్లీ 'వేదికను సృష్టిస్తుంది. ఫ్యాషన్ తదుపరి స్థాయికి ఇది రంగాన్ని సిద్ధం చేస్తుంది. ట్రెండ్స్ తరచూ మారుతూ పోయే ఈ ప్రపంచంలో, ఈ ఫ్యాషన్ టూర్ ఒక సాహసోపేతమైన మార్గాన్ని అనుసరిస్తూ, ఫ్యాషన్ను ముందుకు తీసుకుపోయేందుకు దిశానిర్దేశం చేయటాన్ని మళ్ళీ కల్పన చేసి, 'ఫ్యాషన్స్ నెక్స్ మూవ్'ను పునర్నిర్వచిస్తుంది. ఇది కేవలం ఒక థీమ్ మాత్రమే కాదు. బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ వేదికల పై ఇది ప్రారంభం అవుతుంది. షాహిద్ కపూర్ మరియు తమన్నా భాటియాలతో కలిసి డిజైనర్లు ఫాల్గుణీ మరియు షేన్ పీకాక్లు పాల్గొని 'ద ఫ్యూచర్వేర్స్ ఆఫ్ ఫ్యాషన్'తో గుర్గావ్లో ఫ్యాషన్ అనుభవాల భవిష్యత్తును అనావృతం చేస్తూ ఈ టూర్ ఒక దిశను నిర్దేశిస్తుంది. కోల్కతాలోని ఫినాలేలో'బ్రేకింగ్ ద మౌల్డ్స్ ఆఫ్ ఫ్యాషన్ క్రాఫ్ట్'లో కనిపిస్తుంది. ఇందులో చారిత్రాత్మక డిజైనర్ అనామికా ఖన్నా, ఆమెతో పాటు ఇషాన్ ఖట్టర్లు మళ్ళీ పాల్గొంటారని ఎఫ్డిసిఐ చైర్మన్ సునీల్ సేఠీ తెలిపారు.

భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు 12వ తేదీ సాయంత్రం నాటికి పూర్తికావాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ఎక్కడా ఎలాంటి సమన్వయ లోపం రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సోమవారం ఉదయం కలెక్టరేట్లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పేర్కొన్నారు. సదస్సులో భారత ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు భాగస్వామ్యం కానున్నారని, కావున పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన సదస్సు 14, 15వ తేదీల్లో జరగనుండగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు రోజుల ముందుగానే ఈ నెల 12వ తేదీ రాత్రికి నగరానికి చేరుకుంటారని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సు నిర్వహణలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. సాధ్యమైనంత వరకు డెలిగేట్ కిట్లను రిజిస్ట్రేషన్ సమయంలోనే అందజేయా లన్నారు. అన్ని విభాగాల అధికారులు 12వ తేదీ సాయంత్రం నాటికి ఏర్పాట్లు పూర్తి చేసుకొని ట్రై రన్ నిర్వహించుకోవాలని సూచించారు. రేంజ్ –1 డీఐజీ గోపానాథ్ జెట్టీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషన్ కేతన్ గార్గ్, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంత చందోలు, సత్తిబాబు, లతామాధురి, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

కాంగ్రెస్ నేత ప్రియాంక దండి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి గొప్ప ఆర్థిక వేత్తగా, సంపద సృష్టికర్తగా పేరు ఉందని, గతంలో హైదరాబాద్‌ని అభివృద్ధి చేసింది నేనే అని చెప్పుకునే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 1.5 సంవత్సరాలలో రాష్ట్ర అర్థిక పరిస్థితిని గాడిలో పెట్టే ప్రయత్నంలో పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. రాష్ట్రంలో పేరుగాంచిన ఒక పత్రిక రాష్ట్ర అర్థిక పరిస్థితిని స్పష్టంగా వివరించిందని, కాగ్ కూడ లెక్కలు బయటపెట్టిందన్నారు. గడిచిన 6 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం 63 వేల కోట్లు అప్పులోకి వెళ్ళిపోయిందని, లోటు బడ్జెట్ పూడ్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న కూడా రాష్ట్ర పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే బీజేపీతో పొత్తులో ఉండి ఏం ప్రయోజనం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణానికి సింగపూర్ డిజైన్ మాత్రమే కాదని, ఆదాయం పెంచడంలో కూడా ఆ దేశాన్ని చూసి కూటమి ప్రభుత్వం నేర్చుకోవాలని ఆమె సూచన చేసారు. ఆదాయం చాలా తక్కువగా ఉన్నా ఎక్కువగా చేసి చూపించడం వెనుక ఉన్న మతలబ్ ఏంటి అన్నారు. బ్యాంకుల నుండి రుణాలు పొందడానికే ఆదాయం పెంచి చూపిస్తున్నారా? కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు సామాన్య ప్రజలకు భారంగా మారుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర అర్థిక పరిస్థితికి టీడీపీ, బీజేపీ, జనసేన బాధ్యత వహించాలని ప్రియాంక డిమాండ్ చేసారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: నగరంలోని ప్రతీ వార్డ్‌ను పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ 4వ జోన్ 28వ వార్డు పరిధిలో జీవీఎంసీ నిధులతో సుమారు 39.49 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో సిఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా అనేక పెట్టు బడుల ఒప్పందాలను కుదుర్చుకుంటుందని, తద్వారా అనేక వేలమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. 28వ వార్డులోని భానోజీ నగర్, రామనగర్‌లలో ప్రజల అవసరం మేరకు సుమారు రూ.39.49 లక్షల జీవీఎంసీ నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఉపకార్య నిర్వహక ఇంజనీరు వెంకటేశ్వరరావు, సహాయక ఇంజనీరు పల్లా దుర్గారావు, నక్క రామకృష్ణ, ఇతర జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమితో అమీతుమీకి సిద్ధం

– టిట్టిభ సత్యాగ్రహంను ప్రారంభించిన తెలుగు దండు

విశాలాంధ్ర – విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వంతో 'అమీతుమీ'కి తెలుగుదండు సిద్ధమైంది. తెలుగుభాష రక్షణ కోసం విశాఖ మహానగరంలో కవులు, కళాకారులు, భాషాభిమానుల ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం "టిట్టిభ సత్యాగ్రహం" ను ప్రారంభించింది. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి అనంతరం తెలుగు భాషా సూర్యుడు "సి.పి.బ్రౌన్" జయంతిని ఘనంగా నిర్వహించి అంజలి ఘటించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపవాస దీక్షకు సంకల్పం చెప్పుకొన్న తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ మన దేశవాళీ పాలకుల చేతాళంలో తెలుగుతల్లి దగాపడిందన్నారు. తెలుగుభాష, తెలుగు సంస్కృతి ఈ జాతి సొత్తు అని, దానిని భావితరాలకు అందించడం మన బాధ్యతన్నారు. దానిపై ఎవరు పెత్తనమేంటని ప్రశ్నించారు. అందుకే ఈ నిరవధిక నిరాహార నిరసన దీక్ష అని, తెలుగుభాష రక్షణ విషయంలో కూటమి ప్రభుత్వంతో "అమీతుమీ" తేలేంతవరకూ ఈ దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయం 9గం.ల నుంచి సాయంత్రం 6గం.ల వరకూ దీక్షను నిర్వహిస్తామని తెలియజేశారు. దీక్షా కార్యక్రమంలో తిరుపతి రాజమన్నార్, ఆచార్య ప్రసాద్, అడపా రామకృష్ణ, ఆచార్య సూరప్పడు, ప్రజాకవి దేవిశ్రీ, ఎర్రం నాయుడు, నరహరిశెట్టి శ్రీరధర్, చేబియ్యం మోహన్, హేమా, పంతుల లలిత, ముప్వల రాంబాబు, కానాల భారతి, కోరుకొండ రంగారావు, ఇమంది ఈశ్వరరావు, సీతాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రంలో ప్రజా గాన ప్రపంచం

అందేశ్రీకి కన్నీటి నివాళి ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ



విశాలాంధ్ర – విశాఖ సిటీ: ప్రజల మనసుల్లో పదాలుగా, గీతాలుగా వెలిగిన మహానుభావుడు అందేశ్రీ ఇక లేరన్న వార్త మన కళా ప్రపంచాన్నే కాదు, ప్రతి తెలుగు మనసుని తడిమేసింది. ప్రజల ఆవేదన, వారి ఆనందం, వారి ఆశలు, ఆవేశాలు అన్నీ ఆయన సాహిత్యంలో ప్రతిబింబించాయి. ఆయన గీతాలు కేవలం పదాల సమాహారం కావు, అవి ఒక ఆత్మగీతం ప్రజల గుండెల్లో మ్రోగే మంత్రాలు. గొప్ప సాహిత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన అందేశ్రీ మనల్ని విడిచి వెళ్లడం నా హృదయాన్ని బిగపట్టిన బాధ. ఆయన చూపిన దారిలోనే ఎన్నో తరాలు వెలుగును వెతుకుతున్నాయి. ప్రజా గీతాలకు పునాది వేసిన ఆ మహాకవి, తన ప్రతి అక్షరంతో సమాజానికి చైతన్యాన్ని ఇచ్చాడు. సాహిత్యం ఆయనకు వృత్తి కాదు అది ఆయుధం. పదం ఆయనకు ప్రాణం, ప్రజల కోసం రాసిన ప్రతి గీతం ఆయనకు ప్రాణధార. పాటకు మరణం లేదు సాహిత్యానికి అంతం లేదు అందేశ్రీ లాంటి సృష్టికర్తలు భౌతికంగా దూరమైనా, వారి పదాలు, వారి స్వరం, వారి తత్త్వం మన మనసుల్లో నిత్యం జీవిస్తూనే ఉంటాయి. వారి రచనల్లోనే తెలుగు భాష సుగంధం, మానవతా విలువలు, ప్రజా మనసు స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన రాసిన గీతాలతో నేలతల్లి గర్వపడింది, ప్రజలు చైతన్యం పొందారు, కళాకారులు ప్రేరణ పొందారు. ఆయన ప్రతి అక్షరం ఒక ఉద్యమం, ప్రతి గీతం ఒక అగ్ని. ఈ మహానుభావుడి అకాల మరణం తెలుగు సాహిత్యానికి, ప్రజా గానానికి పెద్ద లోటు. ఆయన స్ఫూర్తి, ఆయన ఆలోచన నా జీవితానికే దీపశిఖ. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ, ఆయన చూపిన ప్రజా సాహిత్య మార్గంలో నేనూ నడుస్తానని మనస్ఫూర్తిగా ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ ప్రతిజ్ఞ చేశారు.

గుడిలోవ పుణ్యక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన రంగనాథ స్వామి దేవాలయం

విశాలాంధ్ర – ఆనందపురం: కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా ఆనందపురం మండలంలోని గుడిలోవ పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. వేకువ జాము నుండే భక్తులు ఇక్కడికి వచ్చి స్థానికంగా ఉన్న పవిత్ర స్నాన ఘట్టంలో అభ్యంగన స్నానాలు ఆచరించారు. ఆ తరువాత నారాయణేశ్వర స్వామి, రంగనాథ స్వామి ఆలయాల్లో ప్రధాన అర్చకుడు కొట్ర కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. దాదాపు పది వేల మంది భక్తులు ఇక్కడకు వచ్చినట్లు దేవాలయ సిబ్బంది అంచనా వేశారు. ఈ సందర్భంగా 5000 మందికి అన్న సంతర్పణకి స్వచ్ఛంద సేవకులు చందక వెంకటరమణ(శివ), రేగాని శంకర్రావు, పట్నాల బంగారునాయుడు, శినగం చిన రామారావు , ఎం.సోమి నాయుడు, ఆర్. వెంకటరావు, బి.జనార్ధన్, చందక పాండు రంగ, బాయిన గురునాధరావు, నాగోతి మహేష్, పిల్లా రాము, కోరాడ చంద్రావు, బోరాడ అప్పలరాజు, వాళ్ళందరి సహకారంతో భక్తులకి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ

కార్యక్రమంలో ముఖ్య అతిథిలు గా జెడ్పిటీసీ కోరాడ వెంకటరావు,మజ్జి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.చందవరపు కుమార్ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పి.యల్.ఎన్.రాజు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లుచేశామన్నారు. ఆలయ చైర్మన్ కోరాడ గిరిరాజు, డైరెక్టర్లు ధనియాల సూరిబాబు, కోరాడ రమేష్ ల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఈవో రాజు తెలిపారు.

శ్రీ ధర్మ శాస్తా సేవ పీఠాన్ని దర్శించుకున్న సుంకరి గిరిబాబు

విశాలాంధ్ర – పద్మనాభం: పద్మనాభం మండలం మద్ది గ్రామంలో ఉన్నటువంటి శ్రీ ధర్మశాస్తా పీఠాని విశాఖపట్నం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు సుంకర గిరిబాబు సందర్శించారు. పీఠంలోని ఉన్న స్వాములతో పాటు విశేష పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించి, పీఠం ప్రాంగణంలో ఉన్న శ్రీ సాగర దుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమం అంతా ముగిసిన తర్వాత తన సొంత నిధులతో స్వాములకు భోజనాలను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రాంబాబు, వైసీపీ మండల యువత అధ్యక్షులు బి సత్యనారాయణ, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి ఏ అప్పారావు, ఇతర స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సుతో యువతకు బంగారు భవిత

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ అవిశ్రాంత కృషి చేస్తున్నారని, విశాఖ సీఐఐ సదస్సు రాష్ట్ర యువత బంగారు భవితకు వేదికని విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ సదస్సులో 410 ఒప్పందాలు, రూ. 9.76 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.48 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు.సీఐఐ సదస్సులో 112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు చేయబోతున్నామన్నారు. సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు, 200 మంది భారత అగ్రశ్రేణి సంస్థల సీఈవోలు, పలువురు కేంద్ర మంత్రులు హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సులో భాగంగా 48 కీలక సెషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, హ్యాకథాన్, బిజిన్ సెస్ టూ గవర్నమెంట్ సమావేశాలు జరుగుతాయని, విశాఖ సీఐఐ సదస్సు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

కోటి సంతకాల సేకరణపై వైసిపి సమావేశం

విశాలాంధ్ర – భీమిలి: భీమిలి నియోజకవర్గం కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను ఆదేశాలు మేరకు 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 2వ వార్డు సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చేస్తున్న అన్యాయలను వివరిస్తూ కోటి సంతకాల సేకరణ చేసి ప్రభుత్వంకు కనువిప్పు కలిగించాలన్నారు. 12వ తేదీన భారీ బైక్ ర్యాలీలు చేయాలని, చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్ నుండి భీమిలి ఆర్డీవో ఆఫీస్‌కు వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 2వ వార్డు నాయకులు శిల్ల కరుణాకర్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, బింగి హరి కిరణ్ రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, వంశీరెడ్డి, చిప్పాడ వెంకటేష్, గుండసూ మధు నాయుడు, తేళ్లపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్న ప్రసాదం

విశాలాంధ్ర – పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధి 64వ వార్డు గంగవరం గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో 41 రోజుల వరకు అయ్యప్ప స్వామి, భవాని మాల ధారణ, హనుమాన్ మాల దారణ, శివమాల ధారణ మాలధరణ చేసిన భక్తులకు అందరికీ నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. 64వ వార్డు వైసీపీ నాయకులు ధర్మాల శ్రీనివాసరావు, మాజీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ వైకుంత వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ దొడ్డి రమణ చేతుల మీదుగా అన్న సమారాధనను ప్రారంభించారు. ఈరోజు అన్న ప్రసాదము మెరుగు ధనరాజు (లేటు) మెరుగు నూకాలమ్మ దంపతుల వారి ఆర్థిక సహాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిప్పల అప్పలరాజు గురు స్వామి, వాకడ ధనరాజు, ఎరిపల్లి పైడిరాజు, గరికిన ధనరాజు, కోవిరి బాపనయ్య పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో ముమ్మన భేటీ

విశాలాంధ్ర – పెందుర్తి: బిజెపి రాష్ట్రఅధ్యక్షుడు పివిఎన్ మాదవ్‌ను పెందుర్తి బిజెపి సీనియర్ నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పోరేటర్ ముమ్మన దేముడు మర్యాదపూర్వకంగా కలిసారు. నగరంలో మదవ్‌ను కలిసిన కార్పోరేటర్ పలు అంశాలపై చర్చించారు. పెందుర్తి నియోజకవర్గంలో పార్టీ పురోగతి గురించి ఆయనతో చర్చించారు. ఆయన వెంట పలువురు బిజెపి నాయకులు ఉన్నారు.

మాదిగ కార్పోరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఉత్తరాంధ్ర పర్యటన

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: నవంబర్ 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు మాజీ శాసనసభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ ఛైర్పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా 12వ తేదీ బుధవారం విశాఖపట్నం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటలకు ఎస్సీ కార్పొరేషన్ సమీక్ష సమావేశం అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. 11వ తేదీన విమానంలో విశాఖ జిల్లాకు చేరుకుంటారని కార్పొరేషన్ కార్య నిర్వాహక సంచాలకులు ఓ ప్రకటన ద్వారా తెలియజేసారు.

ఇంటిగ్రేటెడ్ పాలియేటివ్ అండ్ జెరియాట్రిక్ కేర్ ఫెసిలిటీకి కరూర్ వైశ్యా బ్యాంక్ సీఎస్ఆర్ మద్దతు

విశాలాంధ్ర – విశాఖపట్నం: విశాఖపట్నం నగరంలోని పాలియేటివ్ మరియు జెరియాట్రిక్ కేర్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసే దిశగా ఒక కీలక ముందడుగుగా, కరూర్ వైశ్యా బ్యాంక్ (కే వీ బీ) వృద్ధులు, అంతిమ దశలో ఉన్న రోగుల సంరక్షణకు అంకితమైన లాభాపేక్ష లేని సంస్థ, స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు తన సీ ఎస్ ఆర్ మద్దతును అందించింది. ఈ సహకారం ద్వారా, ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ఫర్ పాలియేటివ్ అండ్ జెరియాట్రిక్ కేర్ సర్వీసెస్‌లోని మొత్తం ఇన్‌పేషెంట్ విభాగం, లెవల్ 1, సి బ్లాక్ నిర్మాణం మరియు సదుపాయాల అభివృద్ధి సాధ్యమైంది. 2012లో స్థాపించబడిన స్నేహ సంధ్యా ఏజ్ కేర్ ఫౌండేషన్, ఔట్‌పేషెంట్ క్లినిక్ హోమ్ విజిట్స్ మరియు ఇన్‌పేషెంట్ కేర్ ద్వారా వృద్ధులు మరియు నయం చేయలేని అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులకు గౌరవప్రదమైన సంరక్షణను అందించడంలో ముందంజలో ఉంది. ఈ కార్యక్రమం, ఆరోగ్య సంరక్షణలో కరూర్ వైశ్యా బ్యాంక్ యొక్క ప్రధాన సీ ఎస్ ఆర్ కార్యక్రమం 'కెవిబి ఆరోగ్యం' లో భాగంగా ఉందని కేవీబీ చైర్మన్ రమేష్ బాబు తెలిపారు.